తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

### కల్పవృక్షవాహనంపై

# విఘ్ననాధుని వైభవం

-కిక్కిరిసిన భక్తజనం





కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సిద్ధి,బుద్ధి సమేతుడైన వరసిద్ధుడు కోరిన వరాలిచ్చే కల్పవృక్షవాహనంపై కాణిపాకం పురవీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా స్వామివారికి బుధవారం కల్పవృక్షవాహన సేవను వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, అర్చకులు మరియు ఆలయ సిబ్బంది ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో వారు ఉదయం మంగళవాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి చందనం, వెన్న పరిమళ పుష్పాలతో పాటు పలు రకాల ఏడు వారాల బంగారు ఆభరణాలతో దేధీప్యమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేసి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే స్వామివారి ఉత్సవమూర్తులకు అలంకారమండపంలో అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. తిరిగి రాత్రి అలంకార మండపంలో గణనాధుడు ఉభయదేవేరులతో కలసి అలంకృతుడై వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చక స్వాముల పూజలందుకున్న అనంతరం కల్పవృక్షవాహనంపై అధిరోహించి కాణిపాకం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. అశేష భక్తజనం నారికేళ కర్పూర సమర్పణతో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఈఈ వెంకట నారాయణ, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెంటెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

### కాణిపాకంలో ఆకట్టుకున్న ప్రత్యేక అలంకరణ





కల్పవృక్షవాహనసేవ సందర్భంగా ఆలయంలో చేపట్టిన ప్రత్యేకాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రధాన ఆలయాన్ని వివిధ రకాల స్వదేశీ, విదేశీజాతి పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్థంభం, గర్భాలయం, అంత్రాలయం, ఆన్వేటి మండపం, సుపథమండపం, అలంకారమండపంలను వివిధ రకాల పుష్పాలు, మామిడితోరణాలు, అరటిచెట్లుతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ముఖ్యంగా బంగారు ధ్వజస్థంభంకు చేసిన ప్రత్యేకాలంకరణ మరింత ఆకర్షణగా నిలిచింది.

## కన్నులపండువగా దేవుని బ్రహ్మోత్సవాలు

### -టిటిడి ఈఓ సింఘాల్

తిరుమల,సెప్టెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవారికి జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వీక్షణ,మూల విరాట్టు దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలనిటిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ అధికారులకు నిర్ధేశం చేశారు. ఏర్పాట్లు, అధికారుల సేవలపై గురువారం రాత్రి అన్నమయ్య భవనంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, డిఎఫ్ఓ ఫణికుమార్‌నాయుడు, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి తదితరులతో కలసి ఈఓ సింఘాల్ తొలిసమీక్షనిర్వహించారు.

# వైభవంగా పోలేరమ్మ జాతర

### అమ్మవారిని దర్శించుకున్న లక్షలాది మంది భక్తులు



పోలేరమ్మ అమ్మవారిని గుడి వద్ద ఉంచిన దృశ్యం

వెంకటగిరి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

వెంకటగిరి గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతర కన్నుల పండుగ ముగిసింది. పోలేరమ్మ అమ్మవారిని లక్షలాదిమంది భక్తులు దర్శించుకుని తరించారు. పోలేరమ్మ అమ్మవారి నిష్కరణ సందర్భంగా పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి గ్రామ ఉత్సవంలో ఇసుకేస్తే రాలని విధంగా భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి ఊరేగింపులో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ గుడి నుండి అమ్మవారిని రాగంపై ఉంచి రాజు వీధి మీదుగా శివాలయం నుండి మల్లమ్మ గుడి వీధిలోని అమ్మవారి నిష్క్రమణ వరకు తీసుకొని వెళ్లారు. అక్కడ అమ్మవారి రూపాన్ని నిరూపంగా మార్చారు. పోలేరమ్మ అమ్మవారిని బుధవారం రాత్రి జీనుగుల వారి వీధి నుండి గుడి వరకు రథంపై తీసుకొని వస్తుండగా భారీగా వర్షం పడ్డ భక్తులు లెక్కచేయకుండా తిలకించారు. భారీ వర్షం అమ్మవారి జాత రకు అంతరాయం కలిగింది. బుధవారం సాయంత్రం అత్తవారిల్లుగా భావించే కుమ్మరి వీధిలో అమ్మవారిని తయారు చేస్తారు. ఇక్కడ అమ్మవారికి కళ్ళు పెట్టరు. కుమార్ వీధి నుండి అమ్మవారిని అత్తవా రిలుగా భావించే జీను గల వారి వీధిలోని అలంకార మండపానికి అమ్మవారిని తీసుకుని వెళ్లారు. అక్కడ అమ్మవారికి కళ్ళు అమర్చి బంగారు నగలతో అలంకరించారు. అమ్మవారిని రాగంపై ఉంచి బజారు వీధిలోని గుడి వద్దకు తీసుకొని వచ్చి పెట్టి భక్తుల దర్శనార్థం ఉంచారు. గురువారం తెల్లవారుజాము నుండి సాయంత్రం వరకు అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. లక్షలాదిమంది అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చేర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పర్యవేక్షించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారికి రాజ వంశస్థులు సార వాళ్ళు సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలేరమ్మ జాతర ప్రశాంతంగా ముగిసింది.



లక్షలాది మంది భక్తుల మధ్య ఊరేగుతున్న పోలేరమ్మ అమ్మవారు

## రాయలవారి కోటలో జెసి ఏర్పాట్ల పరిశీలన

### 15న అతిథులకు ఆహ్లాదకర ఆతిధ్య వేదిక



చంద్రగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:

చంద్రగిరి రాయలవారి కోటలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 14, 15న జాతీయ మహిళా సాధికారత కాన్ఫరెన్స్ తిరుపతిలో నిర్వహించనున్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు లోక్‌సభ, శాసనసభ స్పీకర్లు, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు హాజరు కానున్నారు. ఈ నెల 15న రాత్రి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు రాయలవారి కోటలో అతిధులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆతిధ్యమివ్వనున్నారు. ఈ ఆతిధ్య కార్యక్రమానికి రాష్ట్రం నుండే కాకుండా దేశ వ్యాప్తంగా గల సుమారు 400 మంది వివిఐపిలు, విఐపిలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అధికారులు చేస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ క్రమంలో తహశీల్దార్ శివరామసుబ్బయ్య సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజిగ్ లైట్ అండ్ సౌండ్స్ కొరకు చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. కోటకు చేరుకునే మార్గాలను ఆధునీకరించడంతో పాటు విద్యుత్ సమస్యలను నివారించేందుకు ఆ శాఖ అధికారులు రేయింబవళ్ళు చేస్తున్న కృషిని వివరించారు. ఆ మేరకు విద్యుత్ పోల్స్ మార్పు, చెట్ల కొమ్మల తొలగింపు, సామర్థ్యానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు వంటి పనులు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కోట వద్ద బ్యారీకేడ్లు, ఎల్‌ఈడి స్క్రీన్ తదితర ఏర్పాట్లను ఆయనకు వివరించారు.

### పోలేరమ్మ ఆలయానికి

## శాశ్వత ఆదాయంకోసం ప్రణాళికలు

### - రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



పోలేరమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పితంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి శాశ్వతంగా ఆదాయం వచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. పోలేరమ్మ జాతర సందర్భంగా మంత్రి కుటుంబ సమేతంగా అమ్మవారికి పట్టు వస్త్రాలను మంత్రి సమర్పించారు. పోలేరమ్మ అమ్మవారికి ఎలాంటి శాశ్వతమైన ఆదాయం లేదని చెప్పారు. ఏ విధంగా ఆదాయం తీసుకొస్తాం త్వరలో తెలియజేస్తామని తెలిపారు. అమ్మవారికి రెండున్నర కోట్ల రూపాయలు విలువ కలిగిన బంగారు ఆభరణాలు తయారు చేసినట్లు చెప్పారు. పట్టణంలోని 70 అంకణాల స్థలంలో కోటి 65 లక్షల రూపాయలతో ధ్యాన మందిరం నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతరకు భక్తులు లక్షలాది మంది వచ్చారు అని చెప్పారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పోలేరమ్మ అమ్మవారి మహిమ కలిగిన దేవత అని చెప్పారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, పారిశ్రామికవేత్త గంగ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# మామిడి రైతుకు శుభవార్త

**- 37 వేల మంది రైతుకు రూ.160 కోట్లు సబ్సిడీ జమ**
**- ఉద్యానపంటల అభివృద్ధికి రూ.20 కోట్లు ఖర్చు**
**- ఒక్క మామిడి పంట అభివృద్ధికే రూ.10 కోట్లకు పైగా ఖర్చు చేసిన ప్రభుత్వం: కలెక్టర్**

చిత్తూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



మామిడి రైతుకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మామిడి సీజన్ జూన్, జులై నెలల్లో మామిడి గుజ్జు పరిశ్రమలు, ర్యాంపులు, మండీలకు తోతాపురి మామిడి సరఫరా చేసిన రైతులకు ప్రభుత్వం ఇస్తామని హామీ ఇచ్చిన కేజీపై రూ.4 సబ్సిడీ మొత్తం మరో పది రోజుల్లో రైతు వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ కానున్నాయి. ఈ విషయంపై గురువారం కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ విలేకరులకు వెల్లడించారు. సిఎం నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు మామిడి సీజన్‌లో తోతాపురి మామిడి సరఫరా చేసిన రైతులకు కేజీకి రూ.4 చొప్పున 37 వేల మంది రైతులకు ఈ నెల 20 నుండి 25వ తేదీలోపు సబ్సిడీ మొత్తంను రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయడం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మామిడి సీజన్‌లో సుమారు 37 వేల మంది రైతుల నుండి గుజ్జు పరిశ్రమలు, ర్యాంపుల ద్వారా సుమారు 4.10 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. గుజ్జు పరిశ్రమలు, ర్యాంపుల ద్వారా కొనుగోలు చేసిన మామిడికి ఫ్యాక్టరీలు, ర్యాంపుల యాజమానులు కేజీకి రూ.8 చెల్లిస్తారని, ప్రభుత్వం సబ్సిడీ కింద మామిడి రైతులకు కేజీకి రూ.4 అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సెప్టెంబర్ 20 నుండి 25వ తేదీలోపు రైతుల ఖాతాలకు డిబిటి పద్ధతిలో 160 కోట్ల రూపాయల సబ్సిడీ జమ చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి గత రెండు నెలలుగా క్షేత్రస్థాయి వివరాలు సేకరించడం జరిగిందని, గుజ్జు పరిశ్రమల నుండి 2.35 మెట్రిక్ టన్నులు, ర్యాంపుల నుండి 1.65 మెట్రిక్ టన్నులు మొత్తం 4.10 మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలు చేశామన్నారు. దక్షిణ భారతదేశంలో ఏ రాష్ట్రంలోను మామిడి రైతులకు ఇంత పెద్ద మొత్తంలో సబ్సిడీ అందించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల అభివృద్ధికి సుమారు రూ.20 కోట్లు ఖర్చు చేసిందని, మామిడి కాయల కవర్లు, కొత్త మొక్కలు, మౌళిక సదుపాయాలు, రైతులకు శిక్షణ తదితరాలకు రూ.10 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అలాగే 10,500 హెక్టార్ల విస్తీర్ణంలో మైక్రో ఇరిగేషన్ కోసం వంద కోట్లకు పైగా ఉపకరణాలను రైతులకు అందించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక రంగ అభివృద్ధికి సహకారం అందిస్తోందని, సిఎం నారా చంద్రబాబునాయుడు మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల యాజమానుల శ్రేయస్సును ఆలోచిస్తున్నారన్నారు. సబ్సిడీ జమ కాని రైతులు ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని, ఆర్ఎస్‌కెల వద్దకు వెళ్ళి సమస్యలను తెలియజేస్తే వారు సమస్యను పరిష్కరించి మామిడి రైతుల బ్యాంకు ఖాతాలకు సబ్సిడీ మొత్తం జమ చేస్తారన్నారు.

## శ్రీకాళహస్తిలో

# నామినేటెడ్ పదవులకు శ్రీకారం

### టౌన్‌బ్యాంకు చైర్మెన్‌గా ఖాదర్‌బాషా

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల పందారానికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు.మొదట శ్రీకాళహస్తిలోని కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు పదవితో శ్రీకారం చుట్టారు.ఈ పదవిని శ్రీకాళహస్తిలోని మైనారిటీలకు అవకాశం కల్పించారు. గతంలో ఎవ్వరూ మైనారిటి ముస్లింలకు ఇవ్వని గుర్తింపు ప్రస్తుత శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఇస్తున్నారు.ఈ నేపథ్యంలో పార్టీలో ఆది నుంచి ఉంటూ సేవలందిస్తున్న ముత్యాలమ్మగుడివీధికి చెందిన షేక్ ఖాధర్‌బాషాను నామినేట్‌చేస్తూ ఉత్తర్వులు జారి అయ్యాయి.గతంలో ఖాదర్‌బాషా టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షుడుగా పని చేసారు. ప్రస్తుతం చైర్మెన్‌గా అవకాశం కల్పించారు.ఈ బ్యాంకుకు సాధరణంగా షేర్ హోల్డర్లతో ఎన్నికలుజరగాల్సి ఉంది.కానీ గత పదేళ్ళుగా అలా జరగటం లేదు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు ఇక్కడ చైర్మెన్‌ను కమిటిని నామినేట్ చేసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో మైనారిటి నాయకుడు షేక్ ఖాదర్‌బాషాకు టౌన్‌బ్యాంకు చైర్మెన్ అవకాశం వచ్చింది. ఈమేరకు జిఓ ఆర్‌టి నెంబర్ 773 తేది 03.09.2025 మేరకు కమిటిని నామినేట్ చేసారు. చైర్మెన్‌గా షేక్ ఖాదర్‌బాషాను నియమించిన ప్రభుత్వం సభ్యులుగా ఏ.మురళి, ఎం.దొరబాబు, ఏ.బాబు, పి.ఆర్ముగం, పి.రాంబాబు, కె.అనిల్‌కుమార్, ఎస్.గోవర్ధన్ కవితలను నామినేట్ చేసారు. ఈ మేరకు చీఫ్ కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారి చేసారు.ఈమేరకు చైర్మెన్‌గా ప్రకటించిన ఖాదర్‌బాషాకు పలువురు తమశుభాకాంక్షలను తెలిపారు. బిసి విభాగం రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్‌రావు వారి సహచరులు శుభాకాంక్షలు తెలిపారు.

### తిరుమలలో కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్



తిరుమల,సెప్టెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు గురువారం సాయంత్రం టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ మురళీకృష్ణ స్వాగతం పలికారు.

## గోవిందుని బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

కలియుగ వైకుంఠవాసుడు ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చకచకగా సాగుతున్నాయి. నూతన ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ ఆదేశాలతో త్వరగా పూర్తిచేసేందుకు అధికారులు పరుగులుతీస్తున్నారు. ప్రస్తుతం కొండపై ఆలయం పరిసరాలు గ్యాలరీల మయంగా మారింది. ఇలవైకుంఠంగా సాలకట్ల బ్రహ్మోత్సవాలను ఆలయ మాఢవీధుల్లో, భక్తుల నడుమ నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా ఆలయం శుద్ధి చేయడం(కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం) 16వతేదీ మంగళవారం చేపడుతున్నారు.ఆ తరువాత ఆరురోజులకు 23వతేదీ మంగళవారం సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవ ఘట్టాలు మొదలవుతాయి. మరుసటిరోజు 24వతేదీ బుధవారం జరిగే ధ్వజారోహణంతో ఉత్సవాల వేడుకలు మొదలుకానున్నాయి. తొలిరోజే రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

### నేపాల్ నుండి సురక్షితంగా

## స్వదేశం చేరుకున్న భారతీయులు

**ఖాట్మండు విమానాశ్రయం నుండి విశాఖపట్నం మీదుగా రేణిగుంటకు చేరుకున్న ఆంధ్రులు**



రేణిగుంట అక్టోబర్ 11 ప్రభాతవార్త

ఈ మధ్యకాలంలో నేపాల్ దేశం నందు విపరీతమైన అలజడులు జరుగుతున్న నేపథ్యంలో నేపాల్ లో చిక్కుకున్న 144 మంది భారతీయులను భారత ప్రభుత్వం ప్రత్యేక విమానం ద్వారా దేశానికి రప్పించే ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. నేపాల్ రాష్ట్రం ఖాట్మండు విమానాశ్రయం నుండి సుమారు 114మంది ప్రయాణికులు తెలుగువారు కావడంతో గురువారం విశాఖపట్నం విమానాశ్రయం చేరుకున్నారు. అందులో 114 మంది ఆంధ్రులు. 40 మంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాయలసీమ వాసులు కావడంతో వీరినంత విశాఖపట్నం అంతర్జాతీయ నుండి ప్రత్యేక విమానంలో రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయానికి గురువారం రాత్రి చేరుకున్నారు. వీరికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర, తిరుపతి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, డిఎస్పి చంద్రశేఖర రావు, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళి, రాష్ట్ర యాదవ కుల సంక్షేమ సంఘం చైర్మన్ నరసింహ యాదవ్, తుడా వైస్ చైర్మన్ ఆర్ సి మునికృష్ణ తదితరులు ప్రత్యేకంగా ఆహ్వానించి వారి స్వస్థలానికి వెళ్లడానికి ట్రాన్స్‌పోర్ట్ శాఖ ద్వారా ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కరుణాకటాక్షాలతో తిరిగి భారతదేశానికి రాగలిగామని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీసుకురావడానికి ఎంతో కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రత్యేక శ్రద్ధ చూపించిన ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, జిల్లా రెవెన్యూ, పోలీస్ అధికార యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా తమకోసం అనంతపురం నందు జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమాన్ని రద్దు చేసుకొని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చూపిన చొరవకు బాధితులు ఆయన లోకేష్ కు రుణపడి ఉంటామన్నారు.అర్జిటి 5. నేపాల్ నుండి ఇండియా చేరుకున్న సందర్శకులు.

## ఆర్డీఓచే ఆరిముత్తనపల్లి వంక పరిశీలన



**శాంతిపురం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త** స్థానిక ఆరిముత్త నపల్లి వంక ఆక్రమణ ప్రాంతాన్ని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు రాజు పరిశీలించారు. వంక ఆక్రమణకు గురైందని కొంతమంది ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. రెవెన్యూ అధికారులు వ ంక ప్రాంతాన్ని సర్వే చేసి ఆక్రమించిన వారికి నోటీసులు అందించాలని తహశీల్దార్ శివయ్యను ఆదేశించారు. గడ్డూరు వంక వద్దనుంచి పాలారు వరకు సర్వే చేపట్టి ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలన్నారు.ఎంపిడిఓ పిఆర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి,విఆర్వో, సర్పంచ్ ఎవి జయరాం, నేతలు ఉదయ్‌కుమార్, రాధాకృష్ణనాయుడు, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

## ఎంపిడిఓచే పట్టుగూళ్ల..గోకులం షెడ్ల పరిశీలన



**శాంతిపురం, సెప్టెంబర్ 11ప్రభాతవార్త** మండలంలోని శివకురుబూరు గ్రామంలో ఉపాధిహామీ పథకంలో నిర్మిస్తు న్న పట్టుగూళ్ల షెడ్లను, గోకులం షెడ్ల నిర్మాణాలను ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ పరిశీలించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్ల నిర్మాణాలను రైతులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఉపాధిహామీ నిధులతో ప్రభుత్వం అనుమతించిన వివిధ రకాల పంటలసాగుకు నిధులు మంజూరు చేస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిఎ శంకర్ పాల్గొన్నారు.

## పాత బిల్లులను వెంటనే చెల్లించాలని వినతి



***శాంతిపురం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త*** గతంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు వెంటనే మంజూరు చేయాలని వైకాపా సర్పంచులు, ఎంపిటిసిలు గురువారం ఎంపిడిఓ పిఆర్ కుమార్‌ను కోరారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాల గురించి తమకు సమాచారం అందించాలని, ఎంపిటిసిలకు గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లా వైకాపా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు

***కల్లూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త*** పులిచెర్లలో జిల్లా సహకార ప్రింటింగ్ మాజీ చైర్మన్ గోటూరి మురళీమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మురావత్ భాషా, ఎన్ ఎస్ రెడ్డి ప్రకాష్, రాయల్ మోహన్, బీసీ నాయకులు ఎస్ వి రమణ, షౌకత్, కలాం, కోదండయ్య మునస్వామి, శ్రీనివాసులు, మునీశ్వర, నాగరాజా, రాజమూర్తి, కృష్ణమూర్తి, రామ్మూర్తి యాదవ్, దేవేందర్ రెడ్డి, రమణారెడ్డి, మునీర్ ఖాన్, రాంకుమార్ రెడ్డి, విజయ్ కుమార్, వంశీ, కిరణ్, మునిరత్నం, అనిల్, జెడి నారాయణ, కెప్టెన్ రవి, సలాం చాను భాష, ఖాదరవల్లి, ఆనంద్ రెడ్డి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అండర్ 14, 17 క్రీడా విభాగానికి విద్యార్థుల ఎన్నిక

***కల్లూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త*** 69వ ఎస్‌జిఎఫ్‌లో భాగంగా 17వ తేది కల్లూరు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆటల పోటీలు ఎన్నికకు ఏర్పాటు చేసారు. ఇందులో మండలంలోని అన్ని యాజమాన్య విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్నికైన వారిని జిల్లా జట్టు ఎన్నికకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు, అన్ని యజమాన్య పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో నేడు (శుక్రవారం)

పగలు : అభిషేకం , రాత్రి : విమానోత్సవం

**ఉభయదారులు :** కీ॥శే॥కె.రామకృష్ణపిళ్ళై వారి కుమారుడు కెఆర్.గణపతి మరియు కుటుంబసభ్యులు, ఐరాల.మరియు దేవస్థానం వారిచేస్థానిక ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు: ఉదయ 10 గంటల నుండి అర్ధరాత్రి 1 గంటల వరకు ప్రవచనము,భక్తిరంజని, కూచిపూడి, భరతనాట్యం,పౌరాణిక నాటక ప్రదర్శనలు, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు బృందాలచే కోలాటాలు, చెక్కభజనలు, విచిత్ర వేషధారణలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు.

## గణనాధుని సన్నిధిలో జార్ఖండ్ మాజీ సీఎం



***కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:*** జార్ఖండ్ మాజీ సీఎం సరయురాయ్ గురువారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమండపంలో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనానంతరం స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు.

## పేకాటరాయుళ్ళు అరెస్టు

***చిత్తూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:*** చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య ఆధ్వర్యంలో పోలీసులు 24 మంది పేకాట రాయుళ్ళను ఎపి గేమింగ్ యాక్ట్ 3 అండ్ 4 మేరకు 24 మందిని అరెస్టు చేశారు. పోలీసులు వీరి నుండి 6 ప్లేకార్డుల ప్యాకెట్లతో పాటు 37,160 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.

## ప్రజలకు ఆన్‌లైన్ ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు

***చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:*** వైద్య అధికారులు, సిబ్బంది ప్రజలందరికీ ఆన్‌లైన్ ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు కల్పించి ఆరోగ్య సమాజ ఆవిష్కరణకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్లకు ఆయుష్మాన్‌భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రజలందరు తప్పనిసరిగా అభ ఐడికి క్రియేట్ చేసుకోవాలని, దీని ద్వారా ఆరోగ్య సేవలు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం కుప్పంలో డిజిటల్ నర్స్ సెంటర్ నడుస్తోందని అలాగే ఇలాంటి సెంటర్‌ను చిత్తూరులో సైతం ప్రారంభించనున్నామన్నారు. ప్రతి పిహెచ్‌సి అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రజలందరికీ అభ ఐడి క్రియేట్ చేయడం తప్పనిసరిగా చేయాల్సి వుంటుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ సుశీల అభ ఐడి క్రియేషన్ సులభంగా ఎలా చేయాలో వివరించారు. ఈ శిక్షణలో డిపిఎంఓ డాక్టర్ ప్రవీణ, డాక్టర్ అనూష, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ..టూవీలర్ ఢీకొని వ్యక్తి మృతి..



**వి.కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** వి.కోట మండలం ఎడుచుట్ల కోట జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు.స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చింతమాకులపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు 60 ఇతను కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు.ఇతనికి ఇద్దరు భార్యలు నలుగురు పిల్లలు ఉన్నారు.ఇతను సొంత పనుల నిమిత్తం ఏడు చుట్లకోటకు వచ్చి నడుచుకుంటూ జాతీయ రహదారిని దాటుతుండగా వి.కోట నుండి పెర్నంబట్ కి వెళ్తున్న ద్విచక్ర వాహనం వేగంగా రావడంతో శ్రీనివాసులును ఢీకొంది.అతనికి తలకు బలమైన గాయమైంది.స్థానికులు వెంటనే వి.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## హ్యాకథాన్ పోటీలో ఎస్వీయూ విద్యార్థుల ప్రతిభ



**తిరుపతి విద్య సెప్టెంబర్ 11 ప్రభాత వార్త:** ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆదేశాలతో మహిళా వర్సిటీ వేదికగాద జరిగిన అమరావతి క్వాంటం వాలీ హ్యాకథాన్ 2025 సెమీ ఫైనల్ పోటీలో ఎస్వీయూ విద్యార్థులు పలు విభాగాలల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు.నెల్లూరు, తిరుపతి,కడప జిల్లాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇచ్చిన 10 క్వాంటం థీమ్ల మీద వినూత్న ఆలోచనలు ప్రదర్శించారు.ఇందులో సుమారు 50 బృందాలు పాల్గొనగా,ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం లోని ఎమ్ఎస్ డేటా సైన్స్ కోర్సు విద్యార్థులు విజేతలుగా నిలిచారు.ఈ సందర్భంగా వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు విద్యార్థులను ఘనంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య వెంకటేశ్వర్లు, హెచ్ఐడీ ఆచార్య అంజాన్బాబు,ఆచార్య పద్మావతమ్మ,డాక్టర్ రమేష్ బాబు, అధ్యాపకులు పాల్గొని అభినందించారు.

## తీర్థయాత్రలకు అనువైనది మేక్ మైట్రిప్

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 11 ప్రభాత వార్త:** సమూహ ప్రయాణం, స్వల్పకాలిక బసలు, చివరి నిమిషంలో బుకింగ్‌లు యాత్రికుల తీర్థ యాత్రలకు అత్యంత అనువైనది మేక్ మైట్రిప్ అని ఆ సంస్థ సహ వ్యవస్థాపకులు,గ్రూప్ సీఈఓ రాజేష్ మాగోవ్ వెల్లడించారు.గురువారం విలేకరులతో మాట్లాడుతూ తీర్థయాత్ర ప్రయాణం ఎల్లప్పుడూ మన సంస్కృతిలో భాగంగా ఉంది.ఇటీవల కాలంలో తీర్థయాత్రలు చేసే కుటుంబంలోని వ్యక్తుల వయసు, ఆదాయ వనరులను దృష్టిలో ఉంచుకుని పర్యటక ప్రాంతాలను ఎంచుకుంటున్నారన్నారు.ఎక్కువ శాతం ఒక్కరోజు యాత్రలను ఎంపిక చేసుకుంటున్నారని, 35 శాతం మంది రెండు రోజుల యాత్రను 15 శాతం మంది మూడు రోజులు యాత్రను కేవలం ఐదు శాతం మంది మాత్రమే నాలుగు రోజులు యాత్రను ఎంపిక చేస్తున్నారని పేర్కొన్నారు.యాత్రికుల అభిలాషను దృష్టిలో ఉంచుకుని,వారికి తగ్గ విధంగా సులభమైన, సకోరవంతమైన తీర్థయాత్రలను అందించేందుకు మేక్ మై ట్రిప్ కృషి చేస్తుందన్నారు అని అన్నారు.

## వైభవంగా శ్రీ స్వయంప్రకాశానంద శోభాయాత్ర



***పుంగనూరు రూరల్ సెప్టెంబర్ 11 ప్రభాతవార్త*** పట్టణంలో గురువారం హరిహరపుర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి స్వామి వారి శోభాయాత్రను బ్రాహ్మణ సంఘం వారు అత్యం త వైభవంగా నిర్వహించారు. పట్టణానికి విచ్చేసిన స్వామివారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలి కారు. అనంతరం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి, ఆలయ ప్రాంగణం నుంచి రథంపై పురవీధుల్లో ఊరేగింపుగా స్వామివారిని తీసుకువెళ్లారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలు పొందారు.

## వేడుకగా మిథున్ జన్మదినం



***పుంగనూరు రూరల్ సెప్టెంబర్ 11 ప్రభాతవార్త*** పట్టణంలో గురువారం రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను వైసీపీ శ్రేణులు ఘనంగా నిర్వహిం చారు. పట్టణ మున్సిపల్ బస్టాండ్ వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు. అనంతరం బోయకొండ ఆలయ మాజీ డైరెక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్య క్రమం చేపట్టారు.మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాష, ఫక్రుద్దీన్ షరీఫ్, కౌన్సిలర్ అమ్ము, జయరాం, హేమంత్, అస్లాం మురారి, నూర్ భాషా, వైయస్సార్సీపి కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు.

## టిడ్కో ప్రజలకు ప్రత్యేక చౌక దుకాణం



***పుంగనూరు సెప్టెంబర్ 11 ప్రభాతవార్త*** పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద ప్రత్యేక రేషన్ షాపు ఏర్పాటుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా సివిల్ సప్లై అధికారి శంకరన్ టిడ్కో గృహాల సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం నివసిస్తున్న కుటుంబాల రేషన్ కార్డులు, అవసరమైన వివరాలు సేకరించాలని ఎంఆర్ఓకు సూచించినట్లు తెలిపారు. నివాసితుల సౌకర్యం కోసం ప్రత్యేక రేషన్ షాపు అవసరమని గుర్తించి, సంబంధిత వివరాలను సమగ్రంగా సేకరించి, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నామని చెప్పారు. త్వరలోనే రేషన్ షాపు ఏర్పాటు చేసి, గృహాల వద్దే నిత్యావసర సరుకులు అందించేలా చర్యలు తీసుకుంటామని డీఎస్వో వివరించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు ఎమ్మార్వో రాము. ఆర్ఐ పని కుమార్. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రుణమేళా కార్యక్రమం విజయవంతం చేయండి

***వెదురుకుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :*** డ్వాక్రా మహిళలకు చేపట్టిన రుణమేళా కార్యక్రమం విజయవంతం చేయాలని ఎపియం పరశురామ రెడ్డి గురువారం తెలిపారు. మండల కేంద్రంలోగల వెలుగు కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కొరకు వడ్డి లేని రుణాలు అందించే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమం గంగాధర నెల్లూరు శాసన సభ సభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ వియం.థామస్ ఆధ్వర్యంలో జరుగుతుందని పెద్ద సంఖ్యలో మహిళ సంఘం సభ్యులు హాజరుకావలని కోరారు.

## ప్రజా సమస్యలు ప్రశ్నించడం నేరమా !



***వెదురుకుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :*** ప్రజా సమస్యలు ప్రశ్నించడం నేరంగా పరిగణించి విమర్శించడం తగదని భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు వి.రాజేంద్రన్ ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చంగా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అశోక్ రెడ్డి మండలంలోని నల్లవెంగనల్లె పంచాయితీ పరిధిలో వసతుల కల్పనపై ప్రశ్నిస్తే కొందరు చోటా నాయకులు దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్రలలో డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి వేగం సరుగులు పెట్టుతుందన్నారు. కొందరు రాజకీయ నాయకులు మా నాయకులపై నిందలు మోపడం మంచిది కాదన్నారు.

## రూ.8కోట్లతో శ్రీ కనకనాంచారమ్మ ఆలయ అభివృద్ధి



***కుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త*** మండలంలోని నాయనూరు పంచాయతీలో వెలసిన శ్రీ కనకనాంచారమ్మ ఆలయ అభివృద్ధికి సిఎం చంద్రబాబు ఎనిమిది కోట్ల నిధులు మంజూరు చేశారని ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం అమ్మవారిని దర్శి ంచుకున్న అనంతరం అమ్మవారి ఆలయ ం అభి వృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణంకు 3.5కోట్లు,రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం 4.5కోట్ల నిధులు వ్యయం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్య, మౌలిక వసతుల అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్ రాజశేఖర్, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్,మాజీ ఎంపిపిలు సాంబశివం, డా॥ వెంకటేష్,గంగమ్మ గుడి చైర్మన్ బిఎంకె రవిచంద్ర, రెస్కో డైరెక్టర్ శివ, కౌన్సిలర్ సోమశేఖర్, నేతలు దివాకర్, మహేంద్ర, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ చిన్ని మృతి తీరని లోటు



***కుప్పం, సెప్టె ంబర్ 11 ప్రభాతవార్త*** కుప్పం టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్, తెదేపా సీనియర్ నేత విజి చిన్ని మృతి తీరని లోటు అని ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురు వారం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, పికెఎం ఉడా చైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు,ఎపిఇడబ్ల్యుడిసి చైర్మన్ రాజ శేఖర్,ఎఎంసి చైర్మన్ జిఎం రాజు, కడ సభ్యుడు రాజ్‌కుమార్, గంగమ్మగుడి చైర్మన్ బిఎంకె రవిచంద్ర తదితరులు విజి చిన్ని నివాసంలో ఆయన పార్థీవదేహానికి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్‌ఎంలు మాట్లాడుతూ కుప్పం ప్రాంత ప్రజలకు చిరపరితులుగా, దాన కర్ణుడిగా పేరుగాంచిన విజి చిన్ని చిన్నవయసులోనే దూరం కావడం బాధాకర మన్నారు.ఆయనఆత్మకుశాంతికలగాలని ప్రార్థిస్తూ కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. కాగా టౌన్ బ్యాంక్‌మాజీచైర్మన్‌విజిచిన్నిదహన క్రియలను గురువారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు నిర్వహించారు.

## నేడు కుప్పం మండల మీట్

***కుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త*** కుప్పం మండల సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10గంటలనుంచి మండల కార్యాలయంలో జరుగుతుందని ఎంపిడిఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర ్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

## ఘనంగా ఎంపి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు



***కుప్పం, సెప్టెంబర్11 ప్రభాతవార్త*** రాజ ంపేట ఎంపి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ భరత్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలు, నేతలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైకాపా మున్సిపల్ అధ్యక్షుడు హఫీజ్, మాజీ టౌన్‌బ్యాంక్ చైర్మన్ భాగ్యరాజ్, కౌన్సిలర్లు మోహన్‌రాం, విజయ్,రాజ్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల ఇళ్లనుంచే నేరుగా చెత్త సేకరణ



***కుప్పం, సెప్టెంబర్ 11ప్రభాతవార్త*** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు స్వచ్ఛకుప్పం సాధనలో భాగంగా ప్రజల ఇళ్ల నుంచే మున్సిపల్ కార్మికులు నేరుగా చెత్తను సేకరిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక టిబి రోడ్‌లో ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా తమ ఇళ్లల్లో ఉండే ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను నేరుగా మున్సిపల్ కార్మికులకు అందిస్తే వాటిని సేకరించి ప్రజలకు అవసరమైన నిత్యావసరాలు అందిస్తామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఉపాధిహామీలో 2.66లక్షల రికవరీకి ఆదేశం : డ్వామా పిడి



***రామకుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త*** మండలంలో జరిగిన ఉపాధిహామీ పనుల్లో 2.66లక్షల రూపాయల రికవరీకి ఆదేశించినట్లు డ్వామా పిడి రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈసందర్భంగా పిడి మాట్లాడుతూ ఏప్రిల్1 2024నుంచి మార్చి 31,2025 దాకా మండలంలో 32కోట్లతో పనులు జరిగాయన్నారు. ఉపాధిపనుల్లో భూగర్భజలాల పెంపు పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, రాష్ట్ర గ్ర ంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి, నేతలు నరసింహులు, ఆంజనేయరెడ్డి, రామూర్తి, గుర్రప్ప, వెంకటరామగౌడు, కృష్ణానాయక్, జేయి, కామరాజునాయక్, మనోహర్, పెరుమాళ్, భాస్కర్, గజేంద్ర పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల కళ్లలో ఆనందం

***యర్రావారిపాలెం, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త*** కూటమి ప్రభుత్వం ఇచ్చినహామీలు అన్నిఒక్కొక్కటి నెరవేరస్తూ వస్తోందని నిరంజన్ అన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా ఇస్తూ వంటఇంటి మహిళలకు సహాయంగా, చదువుకుంటున్న విద్యార్థులకు ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికి తల్లికి వందనం ఇస్తూ పిల్లల తల్లితండ్రులకు సహాయంగా, అన్నదాతా సుఖీభవ ఇస్తూ రైతులకు సహాయంగా, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తూ మహిళలకు సహాయంగా, మెగా డిఎస్సి నిర్వహించి నిరుద్యోగులకు సహాయంగా కూటమి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నదని నిరంజన్ అన్నారు. ప్రజలు మెచ్చే పరిపాలన చంద్రబాబు నాయుడుకే సాధ్యం అని తెలుగుయువత అధ్యక్షులు నిరంజన్ అన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రజల క్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం



**చిత్తూరురూరల్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రజల క్షేమమే ప్రథమ కర్తవ్యంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, మంత్రి నారాలోకేష్ పనిచేస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. తెలుగువారికి ఎప్పుడు.. ఎక్కడ ఏ ఆపద వచ్చినా మేమున్నామంటూ వారిని ఆదుకోవడంలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందనే విషయాన్ని మంత్రి నారాలోకేష్ మరోసారి నిరూపించారని, నేపాల్‌లో చెలరేగిన తీవ్ర ఆందోళనలు నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న తెలుగు ప్రజలను సురక్షితంగా రాష్ట్రానికి రప్పించేందుకు మంత్రి ఆధ్వర్యంలో రియల్ టైం గవర్నెన్స్ ద్వారా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

## ఘనంగా మిథున్ జన్మదిన వేడుకలు



**చిత్తూరురూరల్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** చిత్తూరు పట్టణం, సంతపేట వైకాపా పార్టీ కార్యాలయం నందు రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి ఏపి రాష్ట్ర మొదలియార్ విభాగం అధ్యక్షులు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంపి విజయానందరెడ్డి కరుమారి అమ్మదేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, 1116 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం సంతపేట కూడలి వద్ద 100కేజీల కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే పార్టీ కార్యాలయ ఆవరణలో అపోలో హాస్పిటల్స్‌కు సంబంధించిన డాక్టర్లు, లయన్ క్లబ్స్ సహకారంతో ఫ్రీ హెల్త్ క్యాంపు నిర్వహించి ఉచితంగా వైద్యపరీక్షలు చేయడంతో పాటు మందులను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, ఆర్‌సి చంద్రశేఖర్, కెపి శ్రీధర్, హరిణిరెడ్డి, మనోహర్‌రెడ్డి, శివారెడ్డి, బాబురెడ్డి, మనోజ్‌రెడ్డి, గిరిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు చిట్టి, శ్రీనివాసన్‌లతో పాటు అపోలో హాస్పిటల్స్ డాక్టర్లు రాంగోపాల్ రెడ్డి, రఘునాథరెడ్డి, గాయత్రి సుమతి, మోనిక, రక్షిత్, శరణ్య, కవిప్రియ, మాధవి, లయన్స్‌క్లబ్ సభ్యులు విజయకుమార్‌రెడ్డి, మహీధర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే కార్యాలయంలో వినతుల స్వీకరణ

**చిత్తూరురూరల్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం, లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నారనీ, ప్రజలు వినతి పత్రంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్‌ను తప్పక జతపరచాలని సూచించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గపరిధిలోని సంబంధితశాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

## ఘనంగా ఎంపి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు



***చౌడేపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త*** రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వైకాపా రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి మిద్దింటి కిషోర్ బాబు, రాష్ట్ర వైకాపా విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్‌భరత్, చౌడేపల్లి సర్పంచు శ్రీరామ్ భరత్ వరుణ్ ఆధ్వ ర్యంలో మృత్యుంజయేశ్వరాలయంలో స్వామివారికి పూజలు, స్థానిక బస్టాండులో పెద్దఎత్తున అన్నదానం, యువకులచే రక్త దాన శిబిరం వంటి సేవా కార్యక్రమాలు జరిగాయి. మండల పార్టీ అధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి, ఉపాధ్యక్షుడు జంగాపల్లి రమణ, మాజీ బోయకొండ ఛైర్మన్ మిద్దింటి శంకరనారాయణ, మాజీ ఎంపిపిలు కూరపర్తి అంజిబాబు, రుక్మిణమ్మ, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, లడ్డు రమణ, రామ్‌కీ, అల్తాఫ్, చెంగారెడ్డి, శ్రీరాములు, సుబ్రమణ్యం, శేషాద్రి, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హుండీ ద్వారా రూ. 55వేలు ఆదాయం



**చౌడేపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త** స్థానిక మృత్యుంజయేశ్వ రస్వామికి హుండీద్వారా రూ. 55,116లు ఆదాయంగా సమకూ రిందని గ్రూప్‌టెంపుల్స్ ఇఓ కమలాకర్‌రావు తెలిపారు. ఆలయంలో ప్రధానార్చకులు రాజశేఖర్‌దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌ల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, సిబ్బంది హరినాథ్, పరకామణి సేవకులు పాల్గొన్నారు.

## సదుంలో ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు.



***సదుం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :*** రాజంపేట పార్లమెంటు సభ్యుడు పెద్దిరెడ్డి వెంకట్ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను సదంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ లోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం దగ్గర మిథున్ రెడ్డి కటౌట్ ను ఆయన అభిమానులు ఏర్పాటు చేశారు. అక్కడ భారీ కేక్ ను తీసుకొచ్చి కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, బూరగ మంద ఎంపీటీసీ మల్లికార్జున, సదుం సర్పంచి ఉషారాణి,ప్రభుత్వ వైద్యశాల చైర్మన్ కృష్ణారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, మండల వైసీపీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి,మాజీ సర్పంచ్ సయ్యద్ భాష, నారాయణరెడ్డి, రమేష్, బషీర్ , రమణారెడ్డి, వాసు ,వైసీపీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



**సదుం సెప్టెంబర్ 11 ప్రభాతవార్త** నేటి సమాజంలో బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పులిచెర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వాణి శ్రీదేవి అన్నారు. గురువారం చెరుకువారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు ఆత్మరక్షణ ఏ విధంగా చేసుకోవాలో తెలి యజేశారు. అదేవిధంగా గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సందీప్ రెడ్డి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, మహిళాపోలీస్ జరీనా, డిఎ లావణ్య, అంగన్వాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మిథున్‌రెడ్డి జన్మదినం

***పలమనేరు టౌన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:*** రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు పలమనేరులో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. వైసిపి టౌన్ కన్వీనర్ హేమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంబిటి రోడ్డులోని క్లాక్ టవర్ వద్ద భారీ సైజు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ మిథున్‌రెడ్డిపై అక్రమకేసులు ఎత్తివేయాలని, ఆ భగవంతుని దయతో ఆయన జైలు నుండి వెంటనే విడుదల కావాలని, మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని, ఉన్నత పదవులతో ప్రజలకు సేవచేయాలని ఆకాంక్షించారు. నాయకులు మండీసుధ, కమాల్, సోమచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం, మహిళలకు చీరలు పంపిణీ

***పలమనేరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:*** మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను బైరెడ్డిపల్లెలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. మాజీ జడ్పీ చైర్మన్ రెడ్డెమ్మ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి మొగసాల క్రిష్ణమూర్తి, జిల్లా ఎంపిపిల అధ్యక్షుడు రెడ్డెప్ప ఆధ్వర్యంలో భారీ సైజు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి మహిళలకు చీరలు పంచిపెట్టారు. పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైయస్ ఆర్టిసియు ఆధ్వర్యంలో మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు



గంగాధర నెల్లూరు సెప్టెంబరు 11 ప్రభాత వార్త: రాజం పేట ఎంపి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల వైయస్ ఆర్టిసియు అధ్య క్షులు కలిజవేడు సుబ్రమణ్యం రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక అల్లి ఎల్లమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు నరసిహ రెడ్డి అశోక్ రెడ్డి జలంధర్ రెడ్డి సుబ్రమణ్యం సురేష్ భూపతిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా యాదవ మహాసభ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం యాదవ్



విజయపురం, సెప్టెంబరు 11 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా యాదవ మహాసభ అధ్యక్షుడిగా విజయపురం మండలం జంబాడకు చెందిన సుబ్రహ్మణ్యం యాదవ్‌ను రాష్ట్ర తెలుగు యాదవ మహాసభ అధ్యక్షుడు కోన గురవయ్య యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడిని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ కమ్యూనిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

సత్యవేడు, సెప్టెంబరు 11 ప్రభాతవార్త: సత్యవేడు మండల కేంద్రంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వెలమసందులోని ఓ పూరిల్లు పూర్తిగా కాలి దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి మోహన్ జయకుమార్ కథనం మేరకు...సత్యవేడు పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో పనిచేసే శేఖర్ వెలమసందులో పూరిల్లు కలిగి ఉన్నారు. శేఖర్ ఇంటిలో ఇంటిలోని వారు ఆయా పనులపై బయట ప్రదేశాలకు వెళ్లి ఉన్నారు. ఈ సందర్భంలో గురువారం మధ్యాహ్నం ఇంటిలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగిమంటలను అదుపు చేశారు.

## ధ్యాన మందిరానికి భూమి పూజ చేసిన మంత్రి



వెంకటగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: రూ.కోటి 65 లక్షలతో నిర్మించే పట్టణంలోని కాసిపేట ప్రాంతంలో ఉన్న మనస్సాక్షి కూటమి స్థలంలో నిర్మించే ధ్యాన మందిరానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కోరుకొండ్ల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, రాష్ట్ర టిట్కో ఛైర్మన్ అజయ్ కుమార్, భూమిపూజ చేశారు. ధ్యాన మందిర భవనాన్ని తృతీయతన నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ధ్యాన మందిరం అన్ని సాంస్కృతి కార్యక్రమాలకు ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, ఆలయం కమిటీ ఛైర్మన్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ప్రతి సంవత్సరం పూలంగి సేవ చేయిస్తా

**- ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిలు**



వెంకటగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: ప్రతి సంవత్సరం పోలేరమ్మ అమ్మవారి జాతర సందర్భంగా పూలంగి సేవ చేయిస్తామని మొక్కుకున్నట్లు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలో జాతర సందర్భంగా ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి,ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తులకు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆయన వెంట నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌లు ఉన్నారు.

## పోలేరమ్మ దర్శించుకున్న ప్రముఖులు



వెంకటగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : గ్రామ శక్తి పోలేరమ్మ జాతర సందర్భంగా ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి చీర సారే అందజేశారు. ఎమ్మెల్సీలు చంద్రశేఖర్ రెడ్డి, బల్లి కళ్యాణ్ చక్రవర్తులు పోలేరమ్మను దర్శించు కున్నారు. జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

# ఉపాధికి ఊరట... వేతన బకాయిలు విడుదల



కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకం కూలీలకు నెలల తరబడి పేరుకుపోయిన వేతన బకాయిలను విడుదల చేస్తూ కేంద్రప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో జిల్లాలోని సుమారు ఒకటిన్నర లక్షల మంది కూలీల ఖాతాల్లోకి మరో వారంరోజుల్లోగా నగదు జమ కానుంది. జిల్లాలోని 37 మండలాల పరిధిలో పనికి వచ్చే కూలీలు ఉన్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌తో పాటు త్వరలోనే రబీసీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కూలీలు వ్యవసాయ పనులపై ఆధారపడుతున్నారు. దీంతో ప్రస్తుతం రోజుకు సరాసరిన రెండువేలమందికి మించి పనులకు రావడం లేదు. మార్గదర్శకాల మేరకు వారంరోజులకు ఒకసారి కూలీలకు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది మే 29వ తేదీ నుంచి కూలీలకు వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయి. ఉపాధి హామీ పథకం పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని మండలాల వారీగా లక్ష్యాలు పెట్టినా క్షేత్రస్థాయిలో కూలీ డబ్బులపై అధికారులను కూలీలు ప్రశ్నిస్తున్నారు. కూలీల వేతనాలు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది. కేంద్రప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు రాకపోవడంతో మూడు నెలలకు పైగా వేతనాలు నిలిచిపోయాయి. అదేవిధంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ప్రాధాన్యత పనులు కింద గ్రామాల్లో కుంటలు, పశువులకు నీటితొట్టెలు నిర్మాణాలతో పాటు చెరువుల అభివృద్ధి, పంట కాలువల పూడిక తీత పనులు చేపట్టారు. తాజాగా వేతన బకాయిలు విడుదల కావడంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భక్తులకు స్వయంగా సేవలందించిన డిఎస్పి



వెంకటగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: పోలేరమ్మ జాతర సందర్భంగా క్యూలో ఉన్న భక్తులకు గూడూరు డిఎస్పి గీతా కుమారి స్వయంగా సేవలందించారు. భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిల్‌లను అందశారు. భక్తులు ఎవరు క్యూలో ఇబ్బంది పడకూడదని ఆమె స్వయంగా తర్వాత సేవలను భక్తులకు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఫీలైన్లలో ఎయిర్ కూలర్లు కూడా ఏర్పాటు చేశారు. భక్తులకు డిఎస్పి సేవలందించడం పట్ల పలువురు ఆమెను కొనియాడారు.

## పేలిన ట్రాన్స్‌ఫార్మర్ - త్రుటిలో తప్పిన ప్రమాదం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మన్ హఠాత్తుగా గురువారం రాత్రి 7 గంటల సమయంలో పెద్దశబ్దంతో పేలిపోయింది. దీని పక్కనే సత్య షాపింగ్ మాల్, రైస్‌మిల్లు, నివాస ప్రాంతాలు ఉండటంతో చుట్టుపక్కల వారు హడలి పోయారు. దీనికి తగ్గట్టుగా ఆర్డీఓ కార్యాలయం క్రింది భాగంలో ఎఫ్ఎస్‌టిఎస్ నూతన కార్యవర్గ అభినందన సభ జరుగుతుండటంతో జనం పెద్దఎత్తున ఈ ప్రాంతంలో గుమికూడి ఉన్నారు. పెద్ద శబ్దంతో ట్రాన్స్ ఫార్మన్ పేలిపోయి మంటలు చెలరేగడంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. దీంతో అభినందన సభకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో అంతరాయం ఏర్పడింది. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఈ సంఘటన జరిగినప్పుడు సభ ప్రాంగణం వద్ద ఉన్నారు. అగ్నిమాపక శాఖ వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## బంగారు నగ సమర్పించిన రాజవంశస్తులు



వెంకటగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: జాతర సందర్భంగా అమ్మవారికి రాజవంశస్థులైన సర్వజ్ఞ కుమార యాచేంద్ర చీర సారెతో పాటు బంగారు నగను కానుకగా ఇచ్చారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా సాంప్రదాయం ప్రకారం రాజ్యాల ప్యాలెస్ నుండి అమ్మవారికి చీర సారేను సమర్పిస్తారు. రాజవంశస్త పాటు పలువురు నాయకులు ఉన్నారు.

## మజ్జిగ పంపిణీ చేసిన బిజెపి నేత



వెంకటగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: పోలేరమ్మ జాతర సందర్భంగా వచ్చిన భక్తులకు బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులకు ప్రతి సంవత్సరం జాతరలో ధనవంతు సేవలందిస్తానని చెప్పారు. కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పరిపాలన ప్రపంచ దేశాలకు ఆదర్శంగా ఉందన్నారు. నరేంద్ర మోడీ జీవితాంతం ప్రధానమంత్రిగా ఉంటారని చెప్పారు. ముందుగా పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకుని ఆయన పూజలు నిర్వహించారు.

## పోలీసుల తీరుపై మండిపడ్డ భక్తులు

**- వీఐపీల పేరుతో సామాన్య భక్తులను నిలిపివేసిన పోలీసులు**



వెంకటగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: పోలేరమ్మ జాతరలో సామాన్య భక్తుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై భక్తులు మండిపడ్డారు. వందలాది మంది విఐపిలను నేరుగా పంపి మమ్మల్ని క్యూలోనే గంటలు కొద్ది ఆపివేశారని విధి నిర్వహణంలో కొందరు పోలీసులు పై సామాన్య భక్తులు ఆగ్రహం వ్యక్తం. 100, 300, ఉచిత దర్శనం క్యూలైన్లను గంటలు కొద్ది పోలీసులు ఆపివేసి రాజకీయ నాయకులు పంపిన వారిని నేరుగా భక్తులు సహనం కోల్పోయి పోలీసులుపై విరుచుకుపడ్డారు. నాయుడుపేట డిఎస్పి భక్తులను అడుగడుగునా ఇబ్బందులు పాలు చేశారని, భక్తుల పట్ల ఆర్‌డిఎస్‌పి దురుసుగా ప్రవర్తించారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులను మెడ పట్టుకొని తోయడం చేశారని, ఎస్పీ హర్షవర్ధన్ రాజు కూడా ఫిర్యాదు చేశారు. మేము ఏం చేసినా మమ్మల్ని ఎవరు ఏం చేయలేరని కొందరు పోలీసులు వ్యవహరించారని భక్తులు మండిపడ్డారు. కొందరు పోలీసుల తీరు వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడ్డామని సామాన్య భక్తులు ఆవేదన చెందారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తే పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరిస్తున్నారని భక్తులు వాపోయారు. భక్తులను ఇబ్బంది పెట్టిన పోలీసులుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## శ్రమిస్తేనే ఉజ్వల భవిష్యత్తు : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: పార్టీలో శ్రమించి పనిచేస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, అందుకు నిదర్శనం ప్రస్తుతం పదవి పొందిన ఎఆర్ బాలచంద్ర కిషోర్ అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం రాత్రి ఎఫ్ ఎసిఎస్ కార్యవర్గం నూతనంగా ఎన్నికైన సందర్భంగా వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందన్నది తెలుగుదేశం పార్టీ సాంప్రదాయమని చెప్పారు. ఛైర్మన్ ఎఆర్ బాలచంద్రకిషోర్, డైరెక్టర్‌గా ఎంపికైన దువ్వూరు మురళీరెడ్డిని పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, పార్టీ నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, మాధవనాయుడు, బొమ్మన పళణి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్‌లు పాల్గొన్నారు.

## గాఢాంధకారంలో గిరిజన కాలనీ

పెళ్లకూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : మండలంలోని కొత్తూరు పంచాయతీ నందు గల గిరిజన కాలనీలో సుమారు కొన్ని నెలలుగా వీధి దీపాలు వెలగక ప్రజలు గాఢాంధకారంలో ఇబ్బందులు పడుతున్నారు. చీకటి పడితే చాలు ఇంటి నుండి బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. గ్రామం చుట్టుపక్కల పంటపొలాలు ఉండడంతో ఎటు నుండి విషసర్పాలు వస్తాయోనని భయపడుతూ బ్రతుకుతున్నారు. గ్రామంలో వీధి దీపాలు వెలిగి నెలలు గడుస్తున్న ఎవరు పట్టించుకున్న పాపానా పోలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పరిష్కారం చూపాలని ఎదురు చూస్తున్నారు.

## బేకరిలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: మండలంలోని విద్యానగర్‌లోని ఎక్స్‌ట్రా బేకరీని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి తనిఖీ చేశారు. ఆ మేరకు పలు ఆహార పదార్థాలు చెడిపోయి ఉండటం ఆయన గమనించారు. పండ్లు దుర్వాసన రావడంతో ఆయన నిర్వాహకుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. పలు లోపాలను జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదిక ఇస్తామన్నారు. అనంతరం రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆహార పదార్థాలను ప్రజలకు విక్రయించాలే గాని కాలంచెల్లిన పదార్థాలు విక్రయించి ప్రజల జీవితాలతో చెలగాటమాడటం మంచి పద్ధతి కాదన్నారు. ఈ బేకరీపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## జాతరలో అధికారులు... ఇబ్బందుల్లో ప్రజలు

కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వెంకటగిరిలో నిర్వహిస్తున్న పోలేరమ్మ జాతరకు ఇక్కడి ఎంపిడిఓ దిలీప్ కుమార్‌తో పాటు మండల స్థాయి అధికారులను విధులకు కేటాయించారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు.. అధికారులు లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లారు. పలు గ్రామాల ప్రజలు అధికారుల కోసం గంటలతరబడి నిరీక్షించి నిరాశతో వెళ్లారు.

## గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని గోకుల కృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో స్మార్ట్ బ్రెయిన్ ఇంజనీర్స్ అండ్ టెక్నాలజీస్ వారి ఆధ్వర్యంలో హెచ్‌ఎల్ కంపెనీలో సర్వీస్ డెస్క్ ఇంజనీర్స్ పోస్టులకు గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ప్రాంగణ ఎంపికలను కంపెనీ హెడ్ బినిత్, మేనేజర్ ఆనంద్, కోఆర్డినేటర్ హరికృష్ణలు నిర్వహించారు. కళాశాలలోని 155 మంది విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరు కాగా, 27 మందిని ఈ పోస్టులకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో చెన్నై, అమరావతి, విట్స్ కాలేజీల వారితో పాటు చెన్నై ఐఐటి, ఎన్‌బికెఆర్ విద్యార్థులు ఉన్నారు. ఎంపికైన గోకులకృష్ణ కళాశాల విద్యార్థులను శ్రీకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ జి.బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ సురేష్‌లు అభినందించారు.

## కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల నిరాహార దీక్షలు

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో బి.పద్మ అనే మహిళా కండక్టర్‌ను అకారణంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ 14 రోజులుగా ఆర్టీసీ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం వీరు ఈ దీక్షలను కొనసాగించారు. ఈ దీక్షలలో జమాల్, మల్లికార్జున, విజయకృష్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు. దీనదయాళ్, సుబ్బయ్యల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మహిళా కండక్టర్‌కు న్యాయం చేయని పక్షంలో తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆర్టీసీ కార్మిక నాయకులు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి!

గూడూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఒకటవ పట్టణ ఎస్ఐ వివరాల మేరకు గూడూరు పాత బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని పడిపోయి ఉండగా దారిన పోయే గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అన్నారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం మృత దేహాన్ని మార్చురీ కి తరలించడమైనది. మృతుని మెడలో వెంకయ్య స్వామి రాగి డాలర్ ఉందన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన ఎవరైనా గూడూరు ఒకటవ పట్టణ పోలీస్‌లు 9490413803, 9440796342 నంబర్లకు తెలియచేయాలన్నారు.

## హత్యకు కారకులను కఠినంగా శిక్షించాలి



గూడూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: స్థానిక గాంధీనగర్ సమీపంలో బుధవారం హత్యకు గురైన రఫీద్ భాషా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అతని కుటుంబ సభ్యులు గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. రఫీద్ భాషా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ హత్య చేసిన వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించి ఈ తరహా చర్యలు పునారావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## విద్యుత్తు తీగల తగిలి... నాలుగు ఆవులు మృతి

కోట,సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: మండలం కొత్తపట్నం గ్రామ పంచాయతీలోని వావిళ్ల దొరువు గ్రామ సమీపంలో గోవిందపల్లి గ్రామానికి చెందిన ఆవులు మేత మేస్తుండగా విద్యుత్తు తీగల నెలపై పడిఉండటంతో ఆతీగలు తగిలి నాలుగు ఆవులు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతుల మస్తాన్, వెంకటేశ్వర్లు,కరీముల్లా,ఆదిమూర్తిల చెందిన ఆవులగా గుర్తించారు. ఆమేరకు బాధితులు కోట పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. సూమారు, రూ 1.50 లక్షల మేర నష్టపోయినట్లు బాధితులు తెలిపారు.

## ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు



దొరవారి సత్రం,సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 69వ ఎస్‌జిఎఫ్ మండల స్థాయి బాలురు విభాగం లో క్రీడా పోటీలను స్థానిక మండల విద్యాశాఖ అధికారి1 అండ్ 2 కొండయ్య, కృష్ణయ్య మరియు ప్రధానోపాధ్యాయులు నరసింహరావు ఎమ్‌జెపిఎపిబిసి డబ్ల్యూఆర్ ప్రిన్సిపల్ తిరుపతయ్య ప్రారంభించారు. ఈ క్రీడల నందు మండలంలోని అన్ని ప్రభుత్వ మరియు రెసిడెన్సి స్కూల్, మోడల్ స్కూల్ పోటీల్లో పాల్గొనడం జరిగింది. దాదాపు 200 మంది క్రీడాకారులు మండల స్థాయిలో పాల్గొన్నారు అని మండల కోఆర్డినేటర్ టి.రమణయ్య మరియు వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు,లలిత, చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. స్థానిక పోలీసులు మరియు వైద్య సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## చెప్పింది గోరంత... చేసింది కొండంత

**సూపర్ సిక్స్ సూపర్ హిట్ : ఎస్‌సివి నాయుడు**



తొట్టంబేడు,సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: ఎన్నికల ముందు ప్రచారంలో తెలుగుదేశం అధినేతగా చంద్రబాబునాయుడు చెప్పింది గోరంత హామీలని అయితే ముఖ్యమంత్రి అయిన తరువాత 15 నెలల్లో చేసింది కొండంత అభివృద్ధి ప్రజా సంక్షేమమని మాజీ శాసనసభ్యుడు తెలుగుదేశం నాయకుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నేడు వైకాపా నాయకులు చేస్తున్న యూరియా యాగి అంతా వారి సృష్టియే అని ఎద్దేవా చేసారు. గతంలో ఐదేళ్ళ పాటు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన నాయకుడు నేడు అభివృద్ధి గురించి మాట్లాడటం గమనిస్తే ఆయన రాజకీయ అవగాహన ఏమిటో అర్థమౌతుందని విమర్శించారు. నేడు రాష్ట్రంలో ఎక్కడ యూరియా కొరత లేదని అయితే వైకాపా నాయకులు ఆందోళనలు చేయట వారిని ప్రజలు మరచిపోతారనే అని విమర్శించారు. అనంతరంపురం చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌లు సంయుక్తంగా నిర్వహించిన సూపర్ సిక్స్ సభ సూపర్ హిట్ అయ్యిందని, కానీ దానిని జీర్ణించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కారాలు మిరియాలు నూరినట్లు వ్యవహరించటం తగదన్నారు. ఇకనైనా అసత్య ప్రచారాలు మానాలని ఎస్‌సివి అన్నారు.

## కుప్పం ప్రజల ఆరోగ్యం కోసం సంజీవని ప్రాజెక్ట్



కుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : కుప్పం ప్రజలు ఆరోగ్యం కోసం ఆస్తులు అమ్ముకోరాదని వారి ఆరోగ్యం కోసం సిఎం చంద్రబాబునాయుడు ముందుకు వచ్చి సంజీవని పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకా ంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కుప్పం మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల పరిధిలోని 59మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను ఆయన టిడిపి మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లతో కలసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, కౌని ్సలర్ సోమశేఖర్, క ్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కో ఇన్‌చార్జ్ తిరుమగళ్, నేతలు సత్యేంద్రశేఖర్, డికెపల్లి మణి, మహేంద్ర, రవి, షరీఫ్,సతీష్, రవినాయక్,శారదమ్మ, వసంతమ్మ, శ్రీనివాసులు, ఇర్ఫాన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.100 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు



చిత్తూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి 100 కోట్ల రూపాయలతో పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 49, 50వ డివిజన్ల పరిధిలోని కోకావాండ్లవూరులో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జరుగుతున్న మౌళిక వసతుల కల్పన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ కోకావాండ్లవూరు గ్రామస్తులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో డిసెంబర్ నెలాఖరులోపు అన్ని మౌళిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, ఇఇ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, చిత్తూరు తహసిల్దారు కులశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్‌ను కలసిన :బిజెపి నేతలు



తిరుపతి,సెప్టెంబర్ 11ప్రభాతవార్త:తిరుపతి రైల్వేస్టేషన్‌కు వచ్చిన రాష్ట్రమంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను బిజెపి నాయకులు సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాథరెడ్డి, భాస్కర్, దీపక్ యాదవ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి కలిశారు.

## అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం



కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం జరిగిన కల్పవృక్షవాహనసేవ సందర్భంగా ఉభయదారులచే స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను ఘనంగా నిర్వహించారు. ఉభయదారులైన దేవస్థానం కార్యనిర్వ హణాధికారి, అర్చకులు మరియు ఆలయ సిబ్బంది స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను నిర్వహించారు. అనంతరం వేదపండితులు మంత్రపుష్పం గావించారు. ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు,ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండె ంటెల్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఆలయం అభివృద్ధికి ప్రణాళికలతో పనిచేస్తా

**-నూతన ఛైర్మన్ మహేశ్‌యాదవ్**



తిరుపతి,సెప్టెంబర్ 11ప్రభాతవార్త: తాతయ్యగుంటగంగమ్మ ఆలయ పాలక మండలి ఛైర్మన్‌గా ఎన్.మహేశ్‌యాదవ్‌కు అవకాశం దక్కింది. టిడిపిలో యువనేత అయిన మహేశ్ జనసేనపార్టీతోనూ కలసి పని చేస్తు న్నాడు. టిడిపి నగర ప్రధానకార్యదర్శిగా ఉన్న అతనికి అరుదైన అవకాశం లభించింది. ఆలయాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు.

**-పెద్దగంగమ్మ ఆలయ సభ్యుడుగా లక్ష్మణ్**

తిరుపతి పెద్దగంగమ్మ ఆలయ బోర్డు సభ్యుడుగా ఇనుకొండ లక్ష్మణకుమార్ నియమితులయ్యారు. టిడిపికి చెందిన ఇతనికి అవకాశం దక్కింది.

## నిర్మలా సీతారామన్‌కు ఘనస్వాగతం



రేణిగుంట, సెప్టెంబర్ 11ప్రభాతవార్త: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు రేణిగుంట విమానాశ్రయంలో గురువారం ఘన స్వాగతం లభించింది. విమానాశ్రయంలో ఆమెకు రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక వాణిజ్యపన్నులు అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, టిటిడి బోర్డు మెంబర్ భాను ప్రకాష్, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, తిరుపతి ఆర్డిఓ కిరణ్మయి, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుంది : ఎమ్మెల్యే



తిరుపతి విద్య,సెప్టెంబర్ 11 ప్రభాతవార్త: ప్రత్యేక అవసరాల పిల్లలను ఆదుకోవడంలో భాగంగా నగరంలోని టిపిపిఎం స్కూల్‌లో మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ ను పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా సంయుక్తంగా గురువారం ఉదయం అసెస్మెంట్ నిర్వహించాయి. క్యాంప్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ప్రత్యేక అవసరాల పిల్లలను ఆదుకోవడంలో భాగంగా ప్రతి సంవత్సరం మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ ను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఆయన చెప్పారు.గత ఏడాది నిర్వహించిన క్యాంపులో 659 మందికి ఉపకరణాలు అందించినట్లు ఆయన తెలిపారు.ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల అవసరమైన వాళ్ళు ఈ నెల 16 వరకు అధికారులు కలిసి పొందాలని ఆయన సూచించారు.ప్రత్యేక అవసరాల పిల్లల కు ఇచ్చే అలవెన్స్ ను మూడు వేల నుంచి ఆరు వేలకు పెంచినట్లు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో ఏపీసీ గౌరీ శంకర్ రావు,సి ఎం ఓ సురేష్, హేమలత, భవాని, డిప్యూటీ ఈఓ ఇందిర దేవి,ఎంఈఓ బాలాజీ,భాస్కర్ నాయక్, ఐఈడి కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, హెడ్ మాస్టర్ మురుగన్‌లు పాల్గొన్నారు.

## బిల్లును ఉపసంహరించుకోవాలి

రేణిగుంట, సెప్టెంబర్11 ప్రభాతవార్త: విశ్రాంత రైల్వే పెన్షనర్లకు అన్యాయం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును వెంటనే ఉపసంహరి ంచుకోవాలని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్ అన్నారు. రేణిగుంట ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో గురువారం రైల్వే పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశానికి రైల్వే మెన్స్ ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్, సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ కార్యదర్శి యుగంధర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ బ్రాంచ్ చైర్మన్ అస్సం, బ్రాంచ్ కార్యదర్శి జయంత్ కుమార్, ఆఫీస్ బేరర్లు రవీంద్రబాబు, షణ్ముగం, షరీఫ్, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్ నాగేశం, అబ్దుల్ సలీం, కృష్ణయ్య, అల్లా బకాష్, రంగయ్య, రామ్మూర్తి, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, అప్పారెడ్డి, రాజేంద్రన్, అబ్దుల్ సలీం, సుబ్రహ్మణ్యం, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరా నిఘాలో తిరుపతి ప్రెస్‌క్లబ్



తిరుపతి హెల్త్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త: సీసీ కెమెరాల నిఘాలో తిరుపతి ప్రెస్‌క్లబ్ రూపుదిద్దుకుంది. ఈ ఆధుని కరణలో టీటీడీ, దాతల సహకారంతో మరింత హంగులు, రంగులతో ప్రెస్‌క్లబ్ సుందరంగా మారింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మౌర్య, పలువురు దాతలు, టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు, తిరుపతి ప్రెస్‌క్లబ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను కమిటి శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.